క్లుప్తంగా...

నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు వినతి



కీసర: సీఎం కేసీఆర్‌ను మంత్రి చామకూర మల్లారెడ్డితో కలిసి దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్ సోమవారం కలిశారు. దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 4, 5వ వార్డుల్లో స్ట్రామ్ వాటర్ డ్రైనేజీ పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రతి ఒక్కరి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. 81 వినతులు అందినట్లు అధికారవర్గాలు తెలిపాయి. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు రూ.లక్ష సాయం వెంటనే ఇవ్వాలి



సాక్షి, మేడ్చల్‌జిల్లా: కుల వృత్తిదారులకు రాజకీయ, ప్రజాప్రతినిధుల జోక్యం లేకుండా అర్హత కలిగిన వారికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం మేడ్చల్ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో కేటాయించిన మోడ్రన్ దోబీఘాట్‌లకు స్థలాన్ని కేటాయించి, నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలన్నారు. 50 ఏళ్లు నిండిన వృత్తిదారులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. టీఆర్‌వీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతి ఉపేందర్, జిల్లా నాయకులు భాస్కర్, రవి, కోలిపాక శివశంకర్, స్వామి పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం పండ్ల తోటల సాగుపై వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, జిల్లా ఉద్యానవన శాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పండ్ల తోటల సాగు విధానం, పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యానవన అధికారి రేణుక, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, గ్రామ సర్పంచ్ జాంరవి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్టు



మేడ్చల్ ఠాణాలో కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: మంత్రి మల్లారెడ్డి పర్యటన సందర్భంగా వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను మేడ్చల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. డబీల్‌పూర్, లింగాపూర్ తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను మేడ్చల్ పోలీసులు సోమవారం ఉదయం అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల వెంకటేష్, నాయకుడు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మళ్లీ తొలిమెట్టు..!

- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా కార్యాచరణ
- 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ
- బేస్‌లైన్ పరీక్షతో సామర్థ్యం అంచనా వేస్తున్న విద్యాశాఖ
- తదనుగుణంగా తొలిమెట్టుపై ప్రత్యేక చర్యలు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం, గణితంలో నాలుగు ప్రక్రియలకు సంబంధించిన లెక్కలు చేసేలా కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు గతేడాది పాఠశాల విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించి ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ –19 కారణంగా బడుల్లో చదువులు ఆగిపోవడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం తగ్గింది. తిరిగి సామర్థ్యం పెంపొందించేలా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేసింది. ఈ కార్యక్రమం అమలుతో గతేడాది చాలా వరకు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటారు. అందుకే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కొనసాగించేందుకు ఎస్సీఈఆర్టీ నిర్ణయించింది. సక్రమంగా అమలు చేసేందుకు మరోసారి ఉపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించింది.

మూడు విడతల్లో శిక్షణ

గత విద్యా సంవత్సరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇచ్చి ఆగస్టు 15 నుంచి అమలు చేశారు. భాషా, గణిత సామర్థ్యాల సాధనకు శ్రీకారం చుట్టి విద్యా సంవత్సరం ముగిసే వరకు అమలు చేశారు. విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం బోధనాభ్యసన కార్యక్రమాలను రూపొందించి పక్కాగా అమలు చేశారు.

ప్రారంభ పరీక్షతో అంచనా

తొలిమెట్టు అమలులో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న 2వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించి అభ్యసన సామర్థ్యాల స్థాయిని అంచనా వేశారు. ఎస్సీఈఆర్టీ గతేడాది రూపొందించిన ప్రశ్నపత్రాలతో ప్రారంభ పరీక్ష నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు కనబర్చిన సామర్థ్యాల ఆధారంగా అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

24 నుంచి జిల్లాస్థాయిలో శిక్షణ

తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు మళ్లీ శిక్షణ ఇచ్చేందుకు ఎస్సీఈఆర్టీ కార్యాచరణ రూపొందించింది. 1 నుంచి 5 తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణితంలో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు వంతున ఆరుగురిని ఎంపిక చేసి ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. వీరి శిక్షణ ముగిసిన తర్వాత మండల స్థాయిలో ఈ నెల 28 నుంచి ఒక్కో సబ్జెక్టుకు రెండు రోజులు వంతున శిక్షణ ఇవ్వనున్నారు.

సత్ఫలితాలు సాధిస్తాం

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండేలా అమలు చేస్తున్న తొలిమెట్టు సత్ఫలితాలనిచ్చింది. రెండో విడతగా ఈ ఏడాది అమలు చేసి ఉత్తమ ఫలితాలను సాధించేందుకు శ్రద్ధ తీసుకుంటాం. ఈ నెల 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి,
డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

అన్ని పనులను చకచకా పూర్తి చేస్తాం

మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: గ్రామాల్లో హామీలిచ్చి పెండింగ్‌లో ఉన్న పనులను మంగళవారం నుంచి అమలు చేస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబీల్‌పూర్, నూతన్‌కల్, కోనాయిపల్లి, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్ గ్రామాల్లో సోమవారం ఆయన పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. తాను హామీ ఇచ్చిన విధంగా అసంపూర్తి ఆలయాలను పూర్తి చేస్తామని, రోడ్లు లేని చోట ఎమ్మెల్యే నిధులతో రోడ్లు వేస్తామని కుల సంఘాలకు భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

మేడ్చల్ మున్సిపాలిటీలో..

మేడ్చల్ మున్సిపాలిటీలోని 21, 17, 10 వార్డుల్లో పర్యటించి రూ.3.30 కోట్లతో చేపట్టిన పనులను ఆయన ప్రారంభించారు. కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు ఆయన ప్రారంభోత్సవాలు చేశారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో మంత్రి కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలు, బోనాలతో మంత్రికి స్వాగతం పలికారు.



మేడ్చల్‌లో మహిళతో ముచ్చటిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి తన బలగంతో కార్యక్రమాన్ని ఎన్నికల ప్రచారంలా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానంద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషం, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు నందారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, దయానంద్‌యాదవ్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



17వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

అధికారులు ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ ముందంజలో ఉండాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది ముఖ్యంగా సమయపాలన పాటిస్తూ ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలన్నారు. పన్నులను సకాలంలో వసూలు చేస్తూ మున్సిపల్ రెవెన్యూ పెంచడంతో పాటు మున్సిపల్ అభివృద్ధికి పాటుపడాలన్నారు. కమిషనర్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ, హరితహారం, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా, వీధి దీపాల ఏర్పాటు తదితర పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, టౌన్‌ప్లానింగ్ అధికారి కరుణాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ ప్రశాంత్, బిల్‌కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ గబ్బిలాల్‌పేటలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం కార్పొరేటర్ శాంతికోటేష్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామనారు. పేద ప్రజలు అధికంగా ఉండే గబ్బిలాల్‌పేటకు అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరిస్తున్నందుకు మంత్రి మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



నాయీ బ్రాహ్మణుల భవనం స్థలం కోసం వినతి



కావేరిమశ్చేందర్‌రెడ్డికి వినతి అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో నాయీ బ్రాహ్మణుల భవనం కోసం స్థలం కేటాయించాలని సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డికి ఆ గ్రామ నాయీ బ్రాహ్మణులు సోమవారం వినతి పత్రం అందజేశారు. సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయించాలని లేఖలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు భాస్కర్, ఉపాధ్యక్షుడు రాజు, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, రమేశ్, గణేశ్, కోశాధికారి రామాంజనేయులు, రాకేశ్, సురేశ్ పాల్గొన్నారు.

భారీ వర్షం

మేడ్చల్‌రూరల్: ఐదు రోజులు పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం వరుణుడు కరుణించాడని అనుకుని ఊపిరి పీల్చుకునేలోపే సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు అరగంట సేపు వర్షం కురవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



పూడూర్‌లో..

డబుల్ ఇళ్లు పంపిణీ చేయకుండా మోసం

బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి



కీసర పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నేతలు కొంపల్లి మోహన్‌రెడ్డి తదితరులు

కీసర: కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయకుండా 9 ఏళ్లుగా మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నేత కొంపల్లి మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీ సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను సందర్శించేందుకు బీజేపీ మేడ్చల్ నాయకులు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేసి కీసర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కీసర పోలీస్‌స్టేషన్ ఆవరణలో కొంపల్లి మోహన్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ఎన్నికల వేళ మరోసారి ప్రజలను మభ్య పెట్టేందుకు బీఆర్ఎస్ కుట్రలు చేస్తోందన్నారు. బీజేపీ నేతల సందర్శనతో వాస్తవాలు బయటకు వస్తాయన్న భయంతోనే పోలీసులతో తమను అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. డబుల్ ఇళ్ల నిర్మాణానికి కేంద్రం రూ.వేల కోట్ల సాయం తీసుకుందన్నారు. పేదలందరికీ ఇళ్లు పంపిణీ చేసే వరకు పోరాటం ఆగదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. బీజేపీ నేతలు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లాల తిరుమల్‌రెడ్డి, దేశం మల్లేష్‌గౌడ్, బోడ శ్రీనివాస్‌రావు, కోల బాల్‌రాజ్, నాగమల్లారెడ్డి, వేణుగోపాల్, కౌన్సిలర్ లక్ష్మీ, నేతలు సంపత్‌యాదవ్, నల్ల వెంకట్‌రెడ్డి, బండారి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పంపిణీ చేయాలి

మేడ్చల్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల సందర్శన కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు పట్టణ పరిధిలోని కిష్టాపూర్ డబుల్ బెడ్‌రూం ఇళ్లను సోమవారం సందర్శించారు. నిర్మించి వదిలేసిన ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మండల, మున్సిపాలిటీల నాయకులు పాల్గొన్నారు.



కిష్టాపూర్ డబుల్ ఇళ్ల సందర్శనకు వెళ్తున్న బీజేపీ నాయకులు

ప్రతాపసింగారంలో ధర్నా



ప్రతాపసింగారంలో డబుల్ ఇళ్ల వద్ద ధర్నా చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ప్రతాపసింగారంలో నిర్మించిన డబుల్ ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని డబుల్ ఇళ్ల సముదాయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శోభారాణి హాజరయ్యారు. దామోదర్‌రెడ్డి, బస్వరాజ్, ప్రభంజన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు



పిల్లలకు కేక్ తినిపిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మున్సిపల్ మంత్రి కేటీఆర్ పుట్టినరోజును మేడ్చల్ మండలంలో, మేడ్చల్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాలు, వార్డుల్లో బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంత్రి మల్లారెడ్డి వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వారికి కేక్ తినిపించారు.

డబీల్‌పూర్ మజీద్‌ను అభివృద్ధి చేస్తాం

మండలంలోని డబీల్‌పూర్ గ్రామ మజీద్‌ను పూర్తిగా అభివృద్ధి చేస్తామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. మజీద్‌ను ఆయన సందర్శించి సమస్యలను తెలుసుకుని పూర్తిగా అభివృద్ధి చేయడానికి కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ప్రహరీ గోడ, శ్మశానవాటికల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ గీత భాగ్యారెడ్డి, మాజీ సర్పంచ్ రాజమల్లారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు గౌస్, నాయకులు యూనుస్ పాషా, సాహెబ్ పాల్గొన్నారు

నిరుపేదలకు గూడు కల్పించలేని మంత్రి

టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

జవహర్‌నగర్: డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని వికలాంగుల కాలనీలోని డబుల్ బెడ్ రూమ్ వద్ద కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో డబుల్ ఇళ్లను పేదలకు పంచలేదన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్న మల్లారెడ్డి రాష్ట్రంలో, నియోజకవర్గంలోని ప్రజలకు, కార్మికులకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల తిరగాల్సిన మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గంలో తప్ప ఎక్కడా తిరగడం లేదన్నారు. నియోజకవర్గంలోని ఉప్పల్–నారపల్లి ఫ్లైఓవర్ పనులను ఒక్కసారి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించిన పాపాన పోలేదన్నారు. విద్యార్థులకు చదువుకునేందుకు ఇంటర్, డిగ్రీ కళాశాల కూడా కట్టించని సీఎం కేసీఆర్, మంత్రి మల్లారెడ్డికి ఎందుకు ఓటు వేయాలో చెప్పాలన్నారు. డబుల్ ఇళ్లను పరిశీలించేందుకు వస్తే పోలీసులతో ఎందుకు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జవహర్‌నగర్ పోలీసులు వారిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరితవెంకటేష్, జవహర్‌నగర్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, నాయకులు తుంగతుర్తి రవి, సాయిపేట శ్రీనివాస్, వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సదానంద్, సుగుణ, ధనమ్మ, రంజిత, రాజుయాదవ్, కొత్తకొండ వేణు, మంగళారపు లత, గోపాల్, శ్రీనివాస్, ఆనంద్, శ్రీనివాస్, సుమన్, వినయ్, సరిత, సునీత, వెంకటేష్, పవన్‌గౌడ్, ఐలేష్‌యాదవ్, రంగన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

27న కలెక్టరేట్ ఎదుట ధర్నా



మూడుచింతలపల్లి ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మెలో మాట్లాడుతున్న కామ్రేడ్ శివబాబు

శామీర్‌పేట్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిలబెట్టుకోవాలని ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కామ్రేడ్ శివబాబు అన్నారు. మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమ్మెలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె సందర్భంగా ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాలని జేఏసీ పిలుపునిచ్చిందన్నారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో కార్మికులు రవి, కృష్ణ, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.